క్లుప్తంగా

రేపు కబేళా, మాంసపు దుకాణాలకు సెలవు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహావీర్ జయంతి సందర్భంగా ఈ నెల 10వ తేదీన నగరంలో ఉన్న కబేళా, చేపల మార్కెట్లు, మాంసపు దుకాణాలకు సెలవు ప్రకటించినట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. బుధవారం రాత్రి నుంచి కబేళాలో ఎటువంటి జంతువులను వధించడం గానీ, నగరంలోని అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు తెరిచేందుకు గానీ అనుమతి లేదన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించినా, షాపులను తెరిచి మటన్, చికెన్, చేపలను అమ్మినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. మటన్, చికెన్, చేపలు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తులు అన్ని షాపులు మూసి వేయాలని ఆదేశించారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు ఏర్పాటు చేయాలి



రామవరప్పాడు: ప్రతి తరగతి గదిలో చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు (1098) కనిపించేలా ఏర్పాటు చేయాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. విజయవాడరూరల్ మండలం గూడవల్లిలోని కేకేఆర్ గౌతమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీ చైతన్య కళాశాల, పలు హాస్టల్స్‌లో మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించారు. హాస్టల్స్‌లో భోజనశాల, మరుగుదొడ్లు, వసతుల కల్పనను పరిశీలించారు. పద్మావతి మాట్లాడుతూ మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు. భోజనశాల శుభ్రంగా ఉంచాలని, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు తయారీ చేయాలన్నారు. డైనింగ్ హాల్ క్లీనింగ్ రిజిస్టర్ ఉంచాలని, కంప్లైంట్ బాక్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలు ప్రతి నెలా నిర్వహించాలని సూచించారు. అనంతరం శ్రీ చైతన్య కళాశాల సందర్శించి వసతులపై సమగ్ర పరిశీలన చేశారు. విద్యార్థుల శారీరక, మానసిక భద్రత పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు రవి భార్గవ, సీడీపీవో మంగమ్మ, ఎన్టీఆర్ జిల్లా డీసీపీవో ఎం రాజేశ్వరరావు, ఎల్‌సీపీవో కిరణ్‌కుమార్, ఆర్‌ఐ రాజేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో పిల్లి వరలక్ష్మి, అచ్చిబాబు దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక బాబు, పాప సంతానం. వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి హిందూ హైస్కూల్ సమీపంలోని ఓ షాపులో పని చేస్తున్నారు. వరలక్ష్మి కుమార్తె(16) సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతుండగా మందలించారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు నిద్ర లేచేసరికి ఇంట్లో బాలిక కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కుమ్మరిపాలెం సెంటర్‌లో బైక్‌లు తగలబెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న యువకుడు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. కబేళా సెంటర్‌కు చెందిన మేధాంత్ బందరు రోడ్డులోని ఫిట్ జేఈఈ నందు ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. గతంలో కుమ్మరిపాలెం సెంటర్‌లో బైక్‌లకు నిప్పంటించి తగలబెట్టిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఆ తర్వాత కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. కొద్ది రోజుల క్రితం మేధాంత్ కనిపించకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ తెలియలేదు. మేధాంత్ ఆచూకీ తెలియజేయాలని ఫిట్ జేఈఈ ఇన్‌చార్జి నుచ్చికాట్ సుమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

మందుబాబులకు జరిమానా

విజయవాడలీగల్: మద్యం తాగి వాహనాలు నడిపిన 88 మందికి 6వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్ బాబు జరిమానా విధించారు. నగర పోలీసు కమీషనర్ ఆదేశాల మేరకు నగరంలో 2వ, 5వ మరియు 6వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిలో 11మందికి ఒక్కొక్కరికి 15వేలు, 77 మందికి ఒక్కొక్కరికి 10వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి, పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేస్తామని, కావున వాహనచోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమీషనర్ సూచించారు.

అభివృద్ధికి నోచుకోని జగ్జీవన్ రామ్ పార్కు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విజయవాడ నగరంలో కాలువలను పరిశుభ్రపరచడమే కాక కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రీనరీని ఏర్పాటు చేసి నగర సుందరీకరణకు దోహదపడింది. అదేవిధంగా నగరంలో ఎన్నో ఏళ్లుగా వృథాగా పడి ఉన్న ఉద్యానవనాల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించి కొంత మేర అభివృద్ధి చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యానవనాలను పట్టించుకునే నాథుడే లేడు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి.

- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు
- కూటమి ప్రభుత్వంలో నగర ప్రజలకు ఆహ్లాదం ఎండమావే



దెబ్బతిన్న వాకింగ్‌ట్రాక్



పార్కులో మొలిచిన పిచ్చిమొక్కలు



గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకం

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): నగరంలోని 35వ డివిజన్‌లో సీకే రెడ్డి రోడ్డులో ఏలూరు కాలువ వెంబడి ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రామ్ పార్కు ఎటువంటి అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఏలూరు లాకుల వద్ద నుంచి మీసాల రాజారావు బ్రిడ్జి వరకు ఏలూరు కాలువ వెంబడి గ్రీనరీ, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.125 లక్షల అంచనాతో అప్పటి పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు వెలంపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పార్కు చుట్టూ మెస్‌ను ఏర్పాటు చేసి కొంత మేర మొక్కలు కూడా నాటారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు

రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో పార్కు అభివృద్ధి పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో పార్కు నిరుపయోగంగా మారింది. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారింది. వీటికి తోడు గంజాయిబ్యాచ్, మందు బ్యాచ్ సభ్యులు పార్కులోకి చేరి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

ఆహ్లాదం ఆవిరి

గ్రీనరీని ఏర్పాటు చేసి స్థానికులకు ఆహ్లాదాన్ని కలిగించటంతో పాటు వృద్ధులు, యువకులకు ఉపయోగకరంగా ఉండేలా వాకింగ్ ట్రాక్‌ను నిర్మించేందుకు గత ప్రభుత్వం ప్రారంభించిన పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథాగా మారింది. ప్రభుత్వం మారటంతో అధికారులు పనులను పూర్తి చేయకుండా వదిలివేశారు. నగరపాలక సంస్థ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజల అవసరాల కోసం ప్రారంభించిన పనులను కూడా పూర్తి చేయకపోవటం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి



బాబూ జగ్జీవన్ రామ్ పార్కును అభివృద్ధి చేస్తే డివిజన్ ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. పార్కులో వాకింగ్ ట్రాక్‌ను కూడా నిర్మించాలి. వాకింగ్ ట్రాక్ ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో వృద్ధులు, మహిళలు నడవటానికి ఉపయోగకరంగా ఉంటుంది. అదేవిధంగా పిల్లలు ఆడుకోవటానికి ఆట పరికరాలు, పెద్దలకు వ్యాయామ పరికరాలు ఏర్పాటుచేయాలి.

–శరత్‌బాబు(స్థానికుడు)

రెండు పర్యాయాల హామీని విస్మరించిన సీఎం

ఏపీవోఏ కార్యదర్శి కె.పి.రావు



దీక్షలో ఉన్న చెరుకూరి సత్యనారాయణను పరామర్శిస్తున్న కె.పి.రావు

విజయవాడస్పోర్ట్స్: ఓల్గా ఆర్చరీ అకాడమీ అభివృద్ధికి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు రెండు పర్యాయాలు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) అధికారులు రాష్ట్రంలో క్రీడలను ఎలా అభివృద్ధి చేస్తారని రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్(ఏపీవోఏ) కార్యదర్శి కె.పి.రావు ప్రశ్నించారు. ఓల్గా ఆర్చరీ అకాడమీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని 2015, 2019లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ అకాడమీ అధ్యక్షులు, ఆర్చరీ సీనియర్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. దీక్ష చేపడుతున్న సత్యనారాయణను కె.పి.రావు పరామర్శించి మాట్లాడారు. రాష్ట్రానికి ఆర్చరీ క్రీడను పరిచయం చేసి, క్రీడాభివృద్ధికి సత్యనారాయణ తన జీవితాన్ని, ఆస్తులను ధారపోశారన్నారు. అకాడమిని అభివృద్ధిపై శాప్ అధికారులు స్పందించిన తీరు అత్యంత బాధాకరంగా ఉందన్నారు. దీక్ష చేపడుతున్న సత్యనారాయణకు రాష్ట్రంలోని క్రీడాకారులు, క్రీడా సంఘాలు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాజా, చలం, వేణుగోపాల్‌లు సత్యనారాయణను పరామర్శించి సంఘీబావం తెలిపారు.

పేదలపై గ్యాస్ భారం ఉపసంహరించాలి

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచడంపై పశ్చిమ నియోజకవర్గంలో వామపక్షాలు భగ్గుమన్నాయి. గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ సీపీఐ, సీపీఎంలు ధర్నాలు నిర్వహించాయి. పెంచిన ధర తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి.





ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు : గ్యాస్ బండలతో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఐ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం ప్రజలపై వేసిన గ్యాస్ భారాలను తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ పాతబస్తీలోని శంకర్ కేఫ్ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేయటమే మోదీ ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. ఒక వైపు భారాలు వేస్తూ మరోవైపు మతోన్మాద చర్యలకు పాల్పడుతూ దేశాన్ని అస్థిరపరుస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న భారాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. పెంచిన గ్యాస్ ధర తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత ఈవీ నారాయణ, పలువురు కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంచడం దుర్మార్గం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశ ప్రజలపై మోదీ ప్రభుత్వం శ్రీరామనవమి కానుకగా గ్యాస్ ధరలను పెంచిందని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. పెంచిన గ్యాస్ ధరలను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు ధర్నాలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎల్పీజీ సిలిండర్‌పై 50 రూపాయలు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చిందన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఇంటి పన్ను, నీటి పన్ను, ఇలా పన్నులతో సామాన్య ప్రజలపై భారాలు పెరిగాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పోటీ పడి ప్రజలపై భారాలు వేస్తున్నాయని దుయ్యబట్టారు. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు కొట్టు రమణ తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చుపెట్టే బిల్లుకు కూటమి ప్రభుత్వం మద్దతా?



సమావేశంలో మాట్లాడుతున్న అలీం

పటమట(విజయవాడతూర్పు): మతాల మధ్య చిచ్చుపెట్టే వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు కూటమి ప్రభుత్వం మద్దతు ఇవ్వటం ద్వారా ముస్లిం మైనార్టీల పట్ల వారి నిజస్వరూపం బయటపడిందని, విజయవాడ నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు సయ్యద్ అలీమ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో సయ్యద్ అలీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది ఒకటి అని అన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లులో ఇతర మతస్తులను కమిటీల్లో తీసుకోవటం ఎంతవరకు సమంజసమని, దేవాలయ కమిటీల్లో ముస్లింలకు స్థానం ఇస్తారా అని ప్రశ్నించారు. ఈ బిల్లు విషయంలో న్యాయం జరిగే వరకు పార్టీలకు అతీతంగా నిరంతర పోరాటం సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గం మైనార్టీ ప్రెసిడెంట్ ఎండీ అన్వర్, తూర్పు నియోజకవర్గం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ సుభాని, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన సమాపనోత్సవాలు

- కృష్ణాతీరాన నిర్మించిన శ్రీవారి నమూనాలయం
- శ్రీవారికి ఉదయాస్తమాన సేవలు
- సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణ



శ్రీవారి సేవల్లో పాల్గొన్న భక్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానదీ తీరాన భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోని బబ్బూరి గ్రౌండ్‌లో శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీవారి వైభవోత్సవ సహిత హనుమాన్ చాలీసా సమాపనోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా కృష్ణానదీ తీరాన శ్రీవారి నమూనాలయాన్ని నిర్మించి తిరుమల తరహాలో ఉదయాస్తమాన సేవలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్ర సేవా సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెనుమాక గ్రామంలో గల శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్రంలో 365 రోజులపాటు అఖండ శ్రీహనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఇందులో పాల్గొన్న భక్తులను అయోధ్య రామమందిర దర్శనానికి తీసుకువెళ్లనున్నామని చెప్పారు. అఖండ హనుమాన్ చాలీసా పారాయణ ముగింపు కార్యక్రమంలో భాగంగా బబ్బూరి గ్రౌండ్‌లో ఈ నెల 13వ తేదీ వరకు సుమారు 50 వేల మంది భక్తులతో వీర భక్త హనుమాన్ చాలీసా పారాయణ ఏర్పాటు చేశామని చెప్పారు.

శ్రీవారి నమూనాలయంలో ఉదయాస్తమాన సేవలు

తిరుమలలో కొలువై ఉండి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తమ ఆరాధ్య దైవంగా భావించే కలియుగ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పోలి ఉండే నమూనా ఆలయాన్ని కృష్ణానదీ తీరాన నిర్మించామని దూపగుంట్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నమూనాలయంలో తిరుమలలో జరిగేవిధంగా ప్రతి రోజూ శ్రీవారికి జరిగే సుప్రభాత సేవ నుంచి రాత్రి పవళింపు వరకు (ఉదయాస్తమాన) సేవలను నిర్వహిస్తున్నామని వివరించారు. శ్రీవారి భక్తులు ఆయా సేవలలో పాల్గొని తరించాలని కోరారు. ఆధ్యాత్మిక గాయకులుగా ప్రసిద్ధి చెందిన ఎంఎస్ రామారావు (సుందరకాండ ఫేమ్) మనుమడు ఎంఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణ చేస్తామని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కృష్ణానదీ తీరంలో శ్రీవారికి నిత్య సేవలు అందించేందుకు నమూనాలయాన్ని రూపొందించి బృహత్తరమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్ర సేవా సంఘం కార్యదర్శి దూపగుంట్ల శ్రీనివాసరావు, సభ్యులు అభినందనీయులని అన్నారు.

వైభవంగా వసంతోత్సవం



స్వామి వారికి తిరుమంజన సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా వసంతోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. ఉదయం చూర్ణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై అధిష్ఠింపజేసి మంగళవాయిద్యాలతో కృష్ణానదికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని అనుసరించారు. స్వామి వారి ఉత్సవంలో భాగంగా రంగులు పూసుకుంటూ సందడిగా ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం పూర్ణాహుతిని నిర్వహించి ఉత్సవానికి ముగింపు పలికారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో అశ్వవాహనోత్సవాన్ని నిర్వహించారు. చివరిగా ఆలయ అర్చకస్వాములు చోరసంవాదం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అశ్వవాహనోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి వారి సన్నిధిలో మంగళవారం రాత్రి అశ్వవాహనోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో వసంతోత్సవం, చూర్ణుత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా రామచంద్రప్రభువుకు చక్రస్నానం తదితర కార్యక్రమాలను నిర్వహించారు అనంతరం అవభృదోత్సవంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు రంగులు పూసుకొని సందడి చేశారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చక స్వాములు పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు నిర్వహించగా ఆలయ కమిటీ ప్రముఖులు పర్యవేక్షించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సివిల్ సప్లై అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అక్రమంగా నిల్వ ఉంచి తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం పట్టుకొని సీజ్ చేశారు. సర్కిల్ 1పరిధిలోని సింగ్ నగర్ గంగానమ్మ గుడి సెంటర్ ప్రాంతంలో ఓ ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు నిల్వ ఉంచిన సుమారు 100 కేజీలు కలిగిన 100 బియ్యపు బస్తాలను కనుగొని సీజ్ చేశారు. బయట ప్రాంతం నుండి రేషన్ బియ్యంను ఇక్కడకు అక్రమంగా దిగుమతి చేసి నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రభుత్వం పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం ఈ విధంగా అక్రమార్కుల చేతిలోకి వెళ్లడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై ప్రత్యేక చర్యలు తీసుకొంటామని అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ ఈ విధంగా రేషన్ బియ్యం తరలిపోవటం గమనార్హం.

గాలులతో విద్యుత్ శాఖకు రూ.2 లక్షల నష్టం

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రంతా ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. అర్ధరాత్రి వేళ విద్యుత్ స్తంభాలు, తీగలకు మరమ్మతులు నిర్వహించి మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వివిధ గ్రామాల్లో ఆరు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, విద్యుత్ తీగలు తెగిపోయాయని ఏఈ వెంకన్న తెలిపారు. విరిగిన స్తంభాల స్థానంలో యుద్ధప్రాతిపదికన నూతన పోల్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ శాఖకు సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని ఏఈ చెప్పారు.



మే 20న దేశ వ్యాప్త ఆశా వర్కర్ల సమ్మె

మైలవరం: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మే 20వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ. కమల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేద ప్రజలకు కోవిడ్ సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పనిచేసి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసలు అందుకున్న ఆశ వర్కర్లకు నేటికీ కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచకపోవడం దురదృష్టకరమన్నారు. ఎన్‌హెచ్ఎం నిధులు కేటాయించకపోవడం సరైంది కాదని చెప్పారు. వెంటనే ఎన్‌హెచ్ఎం నిధులు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ఇబ్రహీంపట్నం: విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా పని చేస్తూ గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరదల్లో ప్రమాదవశాత్తు మృతిచెందిన వజ్రాల కోటేశ్వరరావు కుటుంబానికి యాక్సిస్ బ్యాంకు అధికారులు బీమా నిమిత్తం రూ.28 లక్షలు మంజూరు చేశారు. స్థానిక డివిజనల్ కార్యాలయంలో మృతుడి భార్య వజ్రాల మాధవీలతకు బ్యాంకు మేనేజర్ ఎండీ మునీర్, డివిజన్ ఈఈ వసంతరావు బీమా చెక్కును మంగళవారం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ బ్యాంకులో మృతునికి వేతనం ఖాతా ఉండటంతో బీమా వర్తించిందన్నారు. తాను చనిపోవడంతో ఆ కుటుంబానికి రూ.28 లక్షలు బీమా రూపంలో అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.